తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మయూర వాహనంపై
వళ్ళీదేవసేన సుబ్రమణ్య స్వామి
సింహవాహనంపై అనందవళ్ళీ అమ్మవారు

చంద్రగిరి, నవంబర్ 13 ప్రభాతవార్త: ముక్కోటి అగస్త్యేశ్వర స్వామివారి ఆల యంలో జరుగుతున్న కార్తీకమాసం ముక్కోటి మహో త్సవాలలో బుధవారం ఉదయం శ్రీవళ్ళీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వారు మయూర వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ గ్రామంలోని స్వర్ణ ముఖీనదీతీరాన వెలసిన శ్రీ ఆనందవల్లీ సమే త అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ముక్కోటి ఉత్సవాలను ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు సాయంత్రం 5:30 గంటలకు ప్రదోషకాల అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆనందవళ్ళీ అమ్మవారు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

అసౌకర్యం లేకుండా ఇక సత్వర సేవలు
-శ్రీవాణి టిక్కెట్ల జారీకి నూతన కౌంటర్లు ప్రారంభం

తిరుమల,నవంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిని మరింత దగ్గరగా వీక్షించి దర్శించుకునే భక్తులకు కల్పించిన శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాల టిక్కెట్లు జారీకి నూతనకౌంటర్లు అందుబాటులోకి వచ్చాయి. గోకులం విశ్రాంతి భవనం ప్రాంగణంలో బుధవారం ఉదయం అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రారంభించారు. ఇక్కడ ప్రతిరోజూ ఆఫ్‌లైన్‌లో 900 శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు జారీచేస్తున్నారు. ఇకపై నిమిషంలోనే ఒక్కోటిక్కెట్ జారీచేయడం జరుగుతుందని అదనపు ఈఓ తెలిపారు. టిటిడి సిఇ సత్యనారాయణ, డిప్యూటీ ఈఓ రాజేంద్ర, విజిఓ సురేంద్ర, ఏఈఓ కృష్ణయ్య, అదనపు ఈఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రసకందాయంలో కుప్పం మున్సిపల్ రాజకీయం

14 మంది కౌన్సిలర్లు వైఎస్సార్సీలోనే కొనసాగుతారా..? ఛైర్మన్ ఛాన్స్‌కు ఇద్దరు వైస్‌ల ముమ్మర యత్నాలు .. మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలసిన రెండో వైస్ ఛైర్మన్.. ఆరుమంది కౌన్సిలర్లు - డిసైడ్ చేసేది ముగ్గురు కౌన్సిలర్లే !!



మాజీ మంత్రి పెద్దిరెడ్డితో సమావేశమైన కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లు

కుప్పం, నవంబర్ 13 ప్రభాతవార్త

రాష్ట్రంలోనే ఓ ప్రతే్యకత సంతరించుకున్న కుప్పం నియోజకవర్గంలో మున్సిపాలిటీ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయనే విషయం విదితమే. ఇప్పుడు చర్చంతా వైఎస్సార్సీ తరపున కౌన్సిలర్లుగా ఎంపికైన 14మంది వైకాపాలోనే కొనసాగుతారా అనే అంశంపై జరుగుతోంది. ఈ పద్నాలుగు మందిలో ఇద్దరు ఇదివరకే మున్సిపల్ వైస్ ఛైర్మన్లుగా కొనసాగుతున్నారు. తాజాగా బుధవారం మున్సిపల్ రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్ మరో ఆరుమంది వైఎస్సార్సీ కౌన్సిలర్లు తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి కుప్పం మున్సిపల్ తాజా రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న వైఎస్సార్సీ కౌన్సిలర్లు పార్టీలోనే కొనసాగాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి సూచించినట్లు సమాచారం. ఇద్దరు వైస్ ఛైర్మన్లతో పాటు మరో పన్నెండు మంది కౌన్సిలర్లు వైకాపాలోనే ఉంటే ఛైర్మన్ ఛాన్స్ తమకే లభిస్తుందని వారు భావిస్తున్నారు. కుప్పం మున్సిపల్ మొదటి వైస్ ఛైర్మన్‌గా మునస్వామి, రెండో వైస్ ఛైర్మన్‌గా ఎస్‌డి హఫీజ్ ఉన్నారు. వీరిద్దరు కూడా అవకాశం వస్తే ఛైర్మన్ సీటు వదులుకోరాదని తమతమవంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. కుప్పం మున్సిపాలిటీలో మొత్తం 25 వార్డులు ఉండగా ఇటీవలే 16వవార్డు కౌన్సిలర్‌గా ఎంపికై మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేసిన డా॥ సుధీర్ తన ఛైర్మన్ పదవికి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈ వార్డుకు ఎన్నిక జరగాల్సి ఉంది. మిగతా 24 వార్డులను పరిశీలిస్తే వైకాపాకు 14మంది, తెదేపాకు 10మంది కౌన్సిలర్లు ఉన్నారు. అధికార తెలుగుదేశం పార్టీ మున్సిపాలిటీ ఛైర్మన్ సీటు దక్కించుకోవాలంటే మరో ముగ్గురు వైకాపా కౌన్సిలర్ల అవసరం ఉంది. ఇందుకు సంబంధించి తెదేపా నేతలు వైకాపా కౌన్సిలర్లకు గాలం వేసేందుకు సిద్ధమయ్యారని సమాచారం. కాగా ఉన్న 14మందిలో ఏ ముగ్గురు తెదేపా వైపు మొగ్గు చూపుతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ పద్నాలుగు మంది వైకాపాలోనే కొనసాగితే మరో రెండేళ్లపాటు ఉన్న ఛైర్మన్ పదవిని అలాగే తమ పార్టీవారే కొనసాగించవచ్చని వైకాపా శ్రేణులు భావిస్తున్నాయి. ఓ పక్క మొదటి వైస్ ఛైర్మన్ మునస్వామి, రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్‌లు ఇద్దరూ తమకు అనుకూలంగా కౌన్సిలర్లను మలచుకోవాలని యత్నిస్తున్నట్లు సమాచారం. రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్‌కు ఇటీవల తెదేపా నుంచి ఆఫర్ వచ్చినా ఆయన తిరస్కరించినట్లు తెలిసింది. ఉన్న కౌన్సిలర్లను అట్టిపెట్టుకుని ఛైర్మన్ ఛాన్స్ కోసం ఇద్దరూ వారి వారి స్థాయిల్లో తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కూడా ఈ పద్నాలుగు మంది కౌన్సిలర్లు హాజరు కాలేదు. పార్టీలో కొనసాగుతున్న కౌన్సిలర్లు మరలా చేజారకుండా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డిలు వారికి అండగా నిలుస్తున్నారని సమాచారం. ఏది ఏమైనా కుప్పం మున్సిపల్ రాజకీయాలు మున్ముందు ఎలాంటి మలుపులు తిరుగుతాయో వేచి చూడాలి.

సాగునీటి ప్రాజెక్టులకు
భారీగా నిధులు

సోమశిల-స్వర్ణముఖి లింక్ ప్రాజెక్టుకు రూ.66కోట్లు
రైతన్నల హర్షం.. పట్టువదలని ఎంఎల్‌ఏ

సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ దృశ్యం

శ్రీకాళహస్తి,నవంబర్ 13 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలోని రెండు సాగునీటి ప్రాజెక్టులకు ఈ ఏడాది బడ్జెట్‌లో పెద్ద పీట వేసారు. ముఖ్యంగా ఈ జిల్లాకు ప్రయోజనం చేకూర్చే తెలుగుగంగ, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్,గాలేరు-నగరి ప్రాజెక్టులకు మోక్షం కల్గనున్నాయి. శ్రీకాళహస్తిశాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చేపట్టిన సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టుతో తన నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లోని రైతులకు సుమారు లక్ష ఎకరాలకు అదనపు సాగునీటి వసతి కల్పించటమే కాకుండా స్వర్ణముఖిలో గంగనీటిని అనుసంధానం చేసి భూగర్భ జలాలు మెరుగుపరచటకు చేపట్టిన ప్రాజెక్టును ఎలాగైనా తన హయాంలో పూర్తి చేయుటకు నిర్ణయించారు.ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు ప్రచారంలో సుధీర్‌రెడ్డి రైతులకు సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించారు.ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో ప్రాధాన్యత కల్గింది.

పట్టువదలని నాయకుడు: సమస్యలపై అవగాహన : నిధుల సాధన:

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జల నియోజకవర్గంలో అభివృద్ధి ఐకాన్‌గా గుర్తింపు ఉంది. గ్రామాల అభివృద్ధితో పాటు శ్రీకాళహస్తి రైతులకు సంబంధించి ఆ కుటుంబంలో పరిపాలించిన నాయకులు వ్యవసాయాభివృద్ధికి, చెరువుల ఆధునీకరణకు గోపాలకృష్ణారెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. అలాగే అదనపుసాగునీటి వసతిని కల్పించుటకు తెలుగుగంగను అందించుటకు సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టును రూపకల్పన చేయించారు. 2004నుంచి ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివిధ రకాల ప్రతిబంధకాలు చోటు చేసుకున్నాయి.ఈ ప్రాజెక్టు ద్వారా 7చెరువులను సమ్మర్ స్టోరేజ్‌లుగా తీర్చిదిద్ది వాటి ద్వారా సాగునీరందించాలన్నది లక్ష్యం.ఈ నేపథ్యంలో రూ.436కోట్ల ప్రాథమిక అంచనాలతో చేపట్టారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో అత్యధికంగా పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు వెలసి ఉన్నాయి.వాటికి మంచినీటి సరఫరా కూడా చేయాల్సి ఉంది. ఇక ఇప్పటికే భారీ పరిశ్రమలకు నిలయంగా ఉన్న శ్రీకాళహస్తి సమీపంలో అపాచి పరిశ్రమ రానుంది. ఈ నేపథ్యంలో సోమశిల-స్వర్ణముఖి కెనాల్ పూర్తి చేయాల్సి ఉంది.ఈ కాలువకు నీటిని కండలేరు నుంచి రాపూర్ నుంచి లిప్ట్ పద్ధతిలో నీటిని అందిస్తారు.ఈ ఏడాది ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.66కోట్లు కేటాయించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఈ పథకానికి సంబందించి చొరవ చూపలేదు. 2022-23 బడ్జెట్‌లో 10.17కోట్లు కేటాయించారు. తరువాత ఎన్నికల సంవత్సరం 2023-24 బడ్జెట్‌లో 41.92కోట్లు కేటాయించారు. కానీ ఆచరణలో ఈ మొత్తాన్ని రూ.4.19కోట్లు మాత్రమే పరిమితం చేసారు.అది కూడా విడుదల చేయలేదు. అయితే ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.66కోట్లు కేటాయింపు చేసుకోవటంలో ఎంఎల్‌ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి చొరవ అభినందనీయం అని నియోజకవర్గం రైతులు అభినందిస్తున్నారు. లిప్ట్ పనులకు రూ.11కోట్లు దక్కవచ్చునని ఇంజనీరింగ్ అధికారులు భావిస్తున్నారు.అయితే ఈ కాలువ నిర్మాణానికి 20 సంవత్సరాలుగా అటవీశాఖ భూముల వివాదం పరిష్కారం కాకుండా ఉంది. ప్రస్తుత కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ ఈ సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు నిధులు:

ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని మూడు ప్రధాన ప్రాజెక్టులకు బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యత కల్పించారని చెప్పవచ్చు. తిరుపతి జిల్లాలో ప్రాధాన్యత కల్గిన,ఎన్‌టిఆర్ రూపకల్పన చేసిన గాలేరు-నగరి ప్రాజెక్టుకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.2438.94కోట్లు కేటాయించారు.ఈ ప్రాజెక్టు పూర్తి చేయగల్గితే మూడు నియోజకవర్గాలకు సాగునీటితో పాటు తిరుపతి పట్టణానికి మంచినీటి సమస్య అనేది ఉండదు. ఇక తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.879కోట్లు కేటాయించారు. మదనపల్లి పరిసర నియోజకవర్గాలకు ప్రాధాన్య కల్పించే హంద్రీ-నీవా ప్రాజెక్టుకు రూ.2014.23 కోట్లు కేటాయించారు. దాంతో సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం కానున్నాయి.ఈ ఏడాది పూర్తి స్థాయి బడ్జెట్‌లో ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుతో మహర్దశ ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో
తండ్రీకొడుకులకు ఐదేళ్ల జైలు శిక్ష విధింపు

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 13, ప్రభాతవార్త

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ఆర్ఎస్ఎఎస్‌టిఎఫ్ ఎఫ్ఏసి తిరుపతి ఎస్పి సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా ఆర్ఎస్ఎటిఎఫ్ ఎస్పి శ్రీనివాస్ పర్యవేక్షణలో డిఎస్పి బాలిరెడ్డి మార్గనిర్దేశంలో గతంలో నమోదై కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధతీసుకొని ప్రాసిక్యూషన్ ద్వారా కోర్టులో సదరు కేసులలో పకడ్బందీగా సాక్షాదారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలుపడే విధంగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఓ కేసులో తీండ్రగుంట రిజర్వు ఫారెస్ట్ తిరుపతి డివిజన్ కరకం బాడి బీటు కృష్ణాపురం సెక్షన్లో పట్టుబడిన ఇద్దరు ముద్దాయిలు అన్నమయ్య జిల్లా, ఎన్ఆర్‌పురం పోస్ట్ పెనగలూరు మండలం సిరివరం గ్రామానికి చెందిన గంగులయ్య కుమారుడు తోట చిన్నచెంగయ్య, తోట చిన్నచెంగయ్య కుమారుడు తోట చెంగయ్య అను తండ్రికొడుకులు ముద్దాయిలను ఆర్ఎస్ఎస్ ఏడిజే కోర్ట్ తిరుపతి జడ్జి నరసింహమూర్తి వారి ఇద్దరికి 5 సంవత్సరాలు జైలుశిక్ష, 6లక్షలు జరిమానా విధించారు. అనంతరం కోర్ట్ ఆదేశాల మేరకు నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

నేటి నుండి ఇంటి వద్దే క్యాన్సర్ పరీక్షలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, నవంబర్ 13 ప్రభాతవార్త: జిల్లాలో గురువారం నుండి ఇంటి వద్ద కాన్సర్ పరీక్షలు నిర్వహించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అందరికీ కాన్సర్ పరీక్షలకు సంబంధించి గోడ పత్రిక, బ్యానర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిని ప్రతి ఒక్కరు కాన్సర్ పరీక్ష నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరికి ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని, స్క్రీనింగ్‌తోనే కాన్సర్‌పై విజయం సాధ్యం అవుతుందన్నారు. ముందస్తు పరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా కాన్సర్‌ను తరిమికొట్టవచ్చునన్నారు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేయకుండా ఎలాంటి సందేహాలకు తావు లేకుండా ఆలస్యం చేయకుండా ప్రతి ఒక్కరు కాన్సర్ పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. జిల్లాలో గురువారం నుండి అసంక్రమణ వాధుల నిర్ధారణ పరీక్షల నిర్వహణ ప్రారంభమవుతుందని, సిహెచ్ఓ, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు రోజుకు ఐదు ఇళ్ళు మాత్రమే స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారిణి హైమావతి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ కల్పించండి
- రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో

నగరి, నవంబరు 13 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి కీళపట్టు శివారులోని కొండలను తవ్వేస్తున్నారని, తమ జీవనాధారమైన అడవి, కొండ నాశనమవుతుందని పర్యావరణాన్ని రక్షించాలంటూ కొండప్రాంతానికి సమీప గ్రామాలకు చెందిన యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కీళపట్టు సమీపం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తంచేస్తూ రాస్తారోకో చేశారు. పర్యావరణాన్ని రక్షించాల్సిన అధికారులు క్వారీలకు అనుమతిచ్చి ప్రజల జీవనాధారమైన కొండలు, అడవులు కోల్పోయేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు వద్ద ఎలాంటి చర్యలు జరపకుండా క్వారీలకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో వచ్చి తమకు సమాధానం చెప్పే వరకు రోడ్డుపై నుంచి లేవమంటూ భీష్మించుకుకూర్చున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసన కారులతో చర్చించారు. రాస్తారోకో చేయడంలో రోడ్డుపై వాహనాలు చాలాదూరం వరకు ఆగిందని పలువురికి ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. సమస్యను ఆర్డీవో కార్యాలయం వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో నిరసన కారులు కీళపట్టు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఆర్డీవో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా ప్రజలకు జీవనాధారంగా నిలుస్తున్న కొండలు, అడవులు క్వారీల ద్వారా నాశనమవుతోందన్నారు. కొండలపై బాంబులు పేలుతుంటే పశువులు ఎలా మేతకు వెళ్తాయన్నారు. స్థానికుల కోరిక మేరకు డీఆర్‌డీవో నిర్వహించిన సదస్సులోను గ్రామస్తులు మైనింగ్ రద్దు చేయాలని కోరడం జరిగిందని, అయినా క్వారీ యాజమాన్యం రాజకీయ పలుకుబడితో క్వారీ నడుపుతోందన్నారు. క్వారీలను ఆపి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. అలా చేయకుంటే గ్రామస్తులు అందరితో కలసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

గూడూరు నియోజకవర్గాన్ని
నెల్లూరు జిల్లాలో కలపండి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ వాణి

అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, నవంబర్ 13, ప్రభాతవార్త

గూడురు నియోజకవర్గంను నెల్లూరు జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అసెంబ్లీలో అభ్యర్థించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాల విభజనలో గూడురు నియోజకవర్గంను తిరుపతి జిల్లా కలిపారని చెప్పారు. దీంతో గూడూరు నియోజకవర్గం ప్రజలు, ఉద్యోగులు జిల్లా కేంద్రమైన తిరుపతికి సుమారు 92 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వుందన్నారు. అయితే గూడురు నియోజకవర్గంకు కేవలం 40 కిలోమీటర్లు దూరంలో వున్న నెల్లూరు జిల్లా పరిధిలో కలపాలని కోరారు. అయితే ఇదే విషయాన్ని ఎన్నికలు సమయంలో ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలో పాల్గొన్న సందర్భంగా కూడా తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి గూడురు నియోజకవర్గంను నెల్లూరు జిల్లాలో కలపాలణి కోరడం జరిగిందన్నారు. దాంతో అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పకుండా గూడూరు నియోజకవర్గంను నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అంతే కాకుండా యువ గళం పాద యాత్రలో ఐటి, విద్యా శాఖ మంత్రి లోకేష్ దృష్టికి ఇదే విషయం తీసుకెళ్లడం జరిగిందణి అసెంబ్లీలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ గుర్తు చేసి గూడురు నియోజకవర్గంను నెల్లూరు జిల్లాలో కలపాలని కోరారు.

వైభవంగా అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు
తెప్పలపై భక్తులకు కనువిందు చేసిన స్వామి, అమ్మవార్లు

నారాయణవనం, నవంబర్ 13 ప్రభాతవార్త : నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం ఉదయం అమ్మవారిని సుప్రభాతసేవలతో మేల్కొలిపి, శుద్ధి, నిత్యకైంకర్యపూజ, బలి, శాత్తుమొర నిర్వహించారు. అనంతరం అభిషేకం చేసిన తర్వాత స్నపన తిరుమంజనం నిర్వహించారు.

తెప్పలపై విహరించిన స్వామి, అమ్మవార్లు :

నారాయణవనంలో ప్రారంభమైనా కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరున్ని తెప్పపై ఘనంగా ఊరేగించారు. అంతకుముందు తిరుచ్చివాహనంపై పురవీధుల్లో ఘనంగా ఊరేగారు. పుష్కరిణిలో అమ్మవారిని 5 చుట్టులు తిప్పారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. భక్తులు టిటిడి అధికారులు ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎఇఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు, శ్రీనివాసభట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్యులు, భక్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొలువుతీరని పాలకమండళ్లు
గాడి తప్పుతున్న ఆలయాల పాలన

సూళ్లూరుపేట, ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి బోర్డును ప్రకటించి వారంరోజులయింది. అయినా స్థానికంగా ఉన్న దేవస్థానాలకు సంబంధించి పాలకమండళ్ల నియామకాలు ఇంతవరకు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు కావస్తున్నా దేవస్థాన పాలక మండళ్ల నియామకంలో జాప్యం చేస్తున్నారు. ప్రస్తుతం సూళ్లూరుపేటలో శ్రీచెంగాళమ్మ దేవస్థానం, శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానాలు దేవాదాయశాఖ పరిధిలో ఉన్నాయి. వీటికి సంబంధించి పాలక మండలి నియామకాలు చేపట్టాల్సి ఉంది. శ్రీచెంగాళమ్మ దేవస్థానం పాలక మండలికి ఛైర్మన్‌తో పాటు సభ్యులుగా ఉండటానికి ఆశావహులు పోటీ పడుతున్నారు. ఈ దేవస్థానానికి నిధులు కొరత లేకపోవడం, దాతలు సమృద్ధిగా ఉండటంతో ఈ దేవాలయాల పాలక మండళ్లు ఏర్పడితే మంచి పేరు వస్తుందన్న కారణంతో దీనిపైనే ప్రతి ఒక్కరు మక్కువ చూపుతున్నారు. కాగా, శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానానికి ఛైర్మన్ పదవికి గాని, పాలకమండలి సభ్యులుగా ఉండేందుకు ఇప్పటివరకు ఎవరూ ఆసక్తి కనబరచడం లేదు. ఈ దేవస్థానంలో నిధులు అంతంతమాత్రంగా ఉండటం, దాతల సహకారం పెద్దగా లేకపోవడంతో ఈ దేవస్థానంలో ఛైర్మన్‌గా, పాలక మండలి సభ్యులుగా ఉండేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో ఈ దేవస్థానానికి వేనాటి మునికృష్ణారెడ్డి ఛైర్మన్‌గా చాలాకాలం పనిచేశారు. అనంతరం నలబోయిన రాజులోచనమ్మ, చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డిలు ఛైర్మన్లుగా పనిచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇద్దరు ఛైర్మన్లు పనిచేసి ఉన్నారు. ప్రస్తుతం విజయదశమి పర్వదినానికి గాని, ఇప్పుడు జరుగుతున్న కార్తీక మాస పూజలకు గాని పాలక మండలి లేకపోవడంతో పాత పాలక మండలిలోని కొంతమంది చొరవ తీసుకొని అప్పటి ఛైర్మన్ సహకారంతో కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందుకు తగ్గట్టుగా ప్రస్తుతం ఉన్న అధికార పార్టీ నాయకులు కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిటీ కూడా వేయకపోవడం దేవస్థానం పాలన గాడి తప్పుతోంది. బాలాంజనేయస్వామి దేవస్థానం విషయానికి వస్తే ఈ దేవస్థానం ఎప్పటినుంచో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. దీనికి కొంతమంది ఆర్యవైశ్య సామాజికవర్గంతో పాటు మరికొంతమంది దాతలు ఉండటంతో అక్కడి భక్తి కార్యక్రమాలు కొంతవరకు జరుగుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు విజయదశమి పర్వదినం అయిపోగా, కార్తీక మాసం కూడా పూర్తి కావస్తుండటం, తిరిగి ధనుర్మాసం ప్రారంభమై ఆంగ్ల సంవత్సరాది ముందుకు వస్తుండటంతో ఆలయాలకు పాలక మండళ్లు నియమించకపోతే కొంతమేర భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కష్టతరమవుతుంది. ప్రభుత్వం త్వరితగతిన ఈ దేవస్థానాలకు పాలక మండళ్లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యక్షుడి గృహప్రవేశానికి హాజరైన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లి, నవంబర్ 13 ప్రభాతవార్త

మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి బుధవారం మండలంలో పర్యటించారు. మండలంలోని 29ఎ.చింతమాకులపల్లికి చెందిన మం డల ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులయాదవ్ నూత నంగా గృహప్రవేశం చేసారు. ఈ కార్యక్రమానికి మా జీ మంత్రి పెద్దిరెడ్డి హాజరై నరసింహులు, హేమలత దంపతులను ఆశీర్వదించారు. మాజీ ఎంపిపిలు కూర పర్తిఅంజిబాబు,రుక్మిణమ్మ,ఉపాధ్యక్షుడుసుధాకర్‌రెడ్డి,వైకాపా నాయకులు రవిచంద్రారెడ్డి, పద్మనా భంరెడ్డి, రమేష్,ఓబుల్‌రెడ్డి,అల్తాఫ్,రాణాదార్‌నాగరాజ,రామ్‌కీమండలంలోనినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగిలీశ్వరాల భూములు వేలం

బంగారుపాళ్యం, నవంబర్ 13 ప్రభాతవార్త:

స్వయంభూ శ్రీ మొగిలీశ్వరాలయంకు చెందిన భూ ముల భుక్తి హక్కుపై అధికారులు బుధవారం బహి రంగ వేలం నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన వేలం పాట నందు యాభై మంది వరకు వేలందారులు పాల్గొన్నారు. ఆలయానికి చెందిన 29 సర్వే నెంబర్లలో 41 ఎకరాలు వివిధ ప్రాంతాల్లో వున్నాయి. ఇందులో 19 సర్వే నెంబర్లకు చెందిన భూముల భుక్తి హక్కు వేలం నిర్వహించగా సంవత్సరానికి 1.30 లక్షల రూపాయల ఆదాయం సమకూరింది. మిగిలిన 10 సర్వే నెంబర్ల భూముల వేలంను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మూడేళ్ళ పాటు భూమి హక్కు పొందిన హక్కుదారులు సాగు చేసుకుని మిగిలిన రెండేళ్ళకు సంబంధించిన మొత్తంను సైతం ఆలయానికి చెల్లించాల్సి వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ శశికుమార్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఇఓ మునిరాజులు తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలు రైతులకు వరం

శ్రీరంగరాజపురం, నవంబర్ 13 ప్రభాతవార్త:

మినీ గోకులాలు పాడి రైతులకు వరమని ఎంపిడిఓ మోహన్‌మురళీ పేర్కొన్నారు. ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపిడిఓ మోహన్‌మురళీ మినీ గోకులాల లబ్దిదారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి పాడి రైతులు మినీ గోకులాలను నిర్మించుకోవాలన్నారు. రెండు, నాలుగు, ఆరు ఆవుల యూనిట్లుగా పరిగణించి ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో గోకులాలను నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. పాడి రైతులు ఈ నిధులు దుర్వినియోగం చేయకుండా కొత్త షెడ్లను నిర్మించుకోవాలని కోరారు. ఈ నెల 15వ తేదీ నాటికి లబ్దిదారులందరు పునాదులు వేసుకోవాలని ఎపిఎం చంద్రశేఖర్ కోరారు. నియోజకవర్గంలోనే అత్యధికంగా 66 మినీ గోకులాలు మంజూరు అయ్యాయని, వీటిని సకాలంలో నిర్మించుకోవాలని పశువైద్యాధికారి శ్రీవిద్య పేర్కొన్నారు.

ఆపరేషన్ ఎఎస్పీగా రాజశేఖర్‌రాజు

చిత్తూరు, నవంబర్ 13 ప్రభాతవార్త:

జిల్లా ఆపరేషన్ అడిషనల్ ఎస్పీగా రాజశేఖర్‌రాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అన్నమయ్య జిల్లాలో అడ్మిన్ ఎఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రాజును చిత్తూరు ఆపరేషన్ ఎఎస్పీగా బదిలీ కావడంతో ఈ మేరకు ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉపాధిహామీలో రూ.39వేల రికవరీకి పిడి ఆదేశం

వి.కోట, నవంబర్ 13 ప్రభాతవార్త

మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి రూ39504లు రికవరీ చేయాలని డ్వామా పిడి రవికుమార్ ఆదేశం చారు. బుధవారం మండల కార్యాలయం వద్ద ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ 2023-24సం॥లో ఉపాధిహామీ పథకంలో రూ 11.13 కోట్లతో వివిధ పనులు చేపట్టినట్లు తెలిపారు. కూలీలు, రైతులు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు పంచాయతీల వారీగా జరిగిన పనులపై సిబ్బంది వివరాలు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఈశ్వరన్న, ఎపిఓ అశోక్‌రెడ్డి, ఎఇ శ్రీనివాస్, ఎస్ఆర్‌పి బుజ్జి, కార్యదర్శులు, ఇఎలు, కూలీలు పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా అన్న సముద్రం మధు

యర్రావారిపాలెం, నవంబర్ 13, ప్రభాతవార్త: టిడిపి రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శి అన్నసముద్రం మధు రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది గత 20 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఆయన 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపునకు కీలకంగా కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన రజక కార్పొరేషన్ డైరెక్టర్ గా అన్న సముద్రం నియమించారు. నాకు ఈ పదవి వచ్చిందానికి కృషి చేసిన ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- నోడల్ అధికారి డా॥ హనుమంత రావు
- కుప్పంలో పలు ఆస్పత్రుల్లో తనిఖీలు !!

కుప్పం, నవంబర్ 13 ప్రభాతవార్త

ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పిసిపిఎన్‌డిటి నోడల్ అధికారి డా॥ హనుమంతరావు హెచ్చరించారు. బుధవారం ఆయన కుప్పంలో రత్న చిల్డ్రన్స్ హోం, వెంకటేశ్వర ఆస్పత్రి, శ్రీప్రియనర్సింగ్‌హోం, సంజీవ్ హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో అన్ని లింగ నిర్ధారణ పరీక్షలు ఎట్టి పరిస్థితుల్లో చేపట్టరాదన్నారు. అలా చేస్తే పదివేల జరిమానాతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. సా ్కనింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ తేదీలు పూర్తయిన వారు మరలా రెన్యువల్ చేసుకోవాలని లేకుంటే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెమో జయరాముడు పాల్గొన్నారు.

నేటి నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

కుప్పం, నవంబర్ 13 ప్రభాతవార్త

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14-20 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కుప్పం గ్ర ంథాలయ అధికారిణి సత్యవాణి తెలిపారు. ఈసందర్భంగా కుప్పం పరిధిలోని ప్రైమరీ, హైస్కూల్, ఎంఎఫ్‌సి కాలేజ్, బిసి బాలికల హాస్టళ్లలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు, విద్యార్థులు గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్‌కు ఘన సన్మానం

కుప్పం, నవంబర్ 13 ప్రభాతవార్త

రాష్ట్ర కురబ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన ఎం.రాజగోపాల్‌ను బుధవారం కుప్పం మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఘనంగా సత్కరిం చారు. స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో ప్ర త్యేకపూజలుజరిపిన అనంతరం రాజగోపాల్‌ను దుశ్శాలువతోసత్కరించారు. అలాగేస్థానికతెదేపా కార్యాల యంలో సైతం డైరెక్టర్ రాజగోపాల్‌ను నేతలు ఘన ంగా సత్కరించారు. కార్యక్రమాల్లో నేతలు జయరాంనాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి దంత సంరక్షణ ఎంతో ముఖ్యం

కుప్పంరూరల్, నవంబర్ 13 ప్రభాతవార్త

ప్రజలు తమ ఆరోగ్యానికి సంబంధించి దంత సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని డా॥ భవ్య సూచించారు. బుధవారం మండలంలోని గోనుగూరు ప్రభుత్వ పాఠశాలలో కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఛైర్మన్ డా॥ మంజునాథ్ అధ్వర్యంలో విద్యార్థులకు దంతాల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డా॥ దివ్య మాట్లాడుతూ విద్యార్థులు రోజూ ఉదయం, సాయంత్రం దంతాలు శుభ్రపరచుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా నాలుగు వందలమంది విద్యార్థులకు ఉచితంగా పేస్ట్, బ్రష్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం ప్రాంగణానికి సర్వే

కుప్పం, నవంబర్ 13 ప్రభాతవార్త

కుప్పం సమీపంలోని అంబేద్కర్ భవనం ప్రాంగణానికి బుధ వారం తెదేపా నేతల అధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. తెదేపా విస్తరణ కమిటీ సభ్యుడు కె.కన్నన్, నేతలు సుబ్బు, రాజ్‌కుమార్, ప్రకాష్, మునస్వామి, మురుగేష్ తదితరుల సమక్షంలో సర్వేయర్ సాయి అంబేద్కర్ భవనం ప్రాంతం సర్వే చేశారు. అనంతరం దళిత నేతలు మా ట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలో అంబేద్కర్ భవనం అభివృద్ధికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని త్వరలోనే దళితులకు భవనం అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకుం టామన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వంచే అధికబడ్జెట్

శాంతిపురం, నవంబర్ 13 ప్రభాతవార్త

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిం చేందుకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రభుత్వం అధిక బడ్జెట్ కేటాయిం చిందని జిల్లా వనరుల కేంద్ర ం పర్యవేక్షణ అధికారి లక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. బుధ వారం కడపల్లి, మొరసనపల్లి, కనమ లదొడ్డి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు త్వరలోనే ఎన్‌పిఎం షాపులు అందుబాటులో వస్తాయన్నారు. ఈ సందర్భంగా వివిధ పంటల సాగుపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఒ అప్పోజి, ఆర్ఎస్‌కె ఇన్‌చార్జ్‌లు నవీన్, గోవర్ధన్, చంద్రు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

అంగన్వాడీ కేంద్రంలో మిని అంగన్వాడీ కార్యకర్త పోస్ట్‌కు నోటిఫికేషన్

కల్లూరు, నవంబర్ 13, ప్రభాత వార్త:

పులిచెర్ల ఐసీడీఎస్ పరిధిలోని పులిచెర్ల మండలం, వెంకటదసరపల్లి పంచాయతీ ఆర్ కుమ్మరపల్లి అంగన్వాడీ కేంద్రంలో మినీ అంగన్వాడి పోస్టు కు నోటిఫికేషన్ ను ఐసీడీఎస్ సూపర్వైజర్ రమాదేవి తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో మినీ అంగన్వాడీ పోస్టుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రానికి బీసీ ఏ కేటగిరి అభ్యర్థులు అర్హులని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్ర గ్రామ పరిధిలోని స్థానిక వివాహితులు, 10 పాస్ అయిన వుండాలని కోరారు. దరఖాస్తు చేసే అభ్యర్థుల వయసు 21 నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలని అన్నారు. 13 తేదీ నుండి 23 తేదీ వరకు పులిచెర్ల సీడీపీఓ కార్యాలయంలో అభ్యర్థుల దరఖాస్తులను సమర్పించాలని కోరారు. వివరాల కోసం పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంను సంప్రదించాలని అన్నారు.

ఉత్తమ డ్రైవర్లు,కండక్టర్లకు డిఎం ప్రశంసలు

పుంగనూరు,నవంబరు 13 ప్రభాతవార్త :

పుంగనూరు ఆర్టీసి డిపోలో అత్యుత్తమ సేవలందించి,ఇంధనపొదుపు,ఆదాయం సాధించిన డ్రైవర్లు, కండక్టర్లను డిపోమేనేజర్ సుధాకరయ్య బుధవారం సత్కరించి ప్రోత్సాహక బహుమతులందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు అన్వర్ 150లీటర్లఉ,జిఎం బాషాలు అత్యధికంగా 136లీటర్ల హెచ్ ఎస్ డి ఇంధనాన్ని పొదుపు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ఇదేవిధంగా కండక్టర్లు అనసూయ ఎక్స్‌ప్రెస్ సర్వీసులో 46.39 ఇపికే,దుర్గాప్రసాద్ 42.26 ఇపికే సాధించారని అభినందించారు. ఈసంద ర్భంగా వారికి ప్రోత్సాహక నగదు బహుతులు అందించారు. ఆర్టీసి ఉద్యోగులు వీరిని ఆదర్శంగా తీసుకుని ఇపికే ,హెచ్ఎస్‌డి పొదుపు చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య,గ్యారేజి,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాతకక్షలతో మహిళపై దాడి

పుంగనూరు రూరల్,నవంబరు 13 ప్రభాతవార్త :

మండలంలోని ఏతూరులో నివసిస్తున్న ఒక మహిళపై బుధవారం ఉదయం కొందరు దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఏతూరుకు చెందిన జ్యోతి ఒంటరిగా ఉన్న సమయంలో గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆమె ఇంట్లోకి జొరబడ్డారు. పాత కక్షలతో ఆమెను తీవ్రంగా గాయపరిచారు. ప్రమాదకర పరిస్థితిలో ఉన్న జ్యోతిను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టిట్కోకాలనీలో తిప్పలే..తిప్పలు...

పుంగనూరు రూరల్,నవంబరు 13 ప్రభాతవార్త :

అట్టహాసంగా ప్రారంభించిన టిట్కోకాలనీలో ప్రజలకు అనేక సమస్యలు తప్పలేదని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు కాలనీవాసులు విజ్ఞప్తిచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాలనీలో ప్రజలు పెన్షన్,మంచినీరు,రేషన్ తీసుకోవాలంటే పడే బాధలు వర్ణణాతీతమని వివరించారు. దీనికి తోడు తమ కాలనీలో వీధికాలువలు,వీధిదీపాలూ లేకపోవడంతో దారుణమైన ఇబ్బందులు పడుతున్నామన్నారు.వీటిని వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

అంతర్‌కళాశాలల యువజన ఉత్సవాల్లో

ఎన్‌పియస్ కళాశాల విద్యార్థిని ప్రతిభ

చిత్తూరురూరల్, నవంబరు 13 ప్రభాతవార్త:

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నవంబరు 8,9,10 తేదిలలో నిర్వహించిన అంతర్ కళాశాలల యువజన ఉత్సవాల్లో శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వకళాశాలకు చెందిన బికాం ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఏసి ఆష్లా 'వెస్ట్రన్ ఓకల్ సోలో' పోటీలో ప్రథమ బహుమతి సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. మనోహర్ తెలిపారు. ఈ యువజన ఉత్సవాల్లో తమ కళాశాల తరపున వక్తృతం, రంగోలి, స్పాట్ ఫోటోగ్రఫీ, స్కిట్, క్విజ్, వెస్ట్రన్ ఓకల్ సోలో తదితర పోటీలలో విద్యార్థినులు పాల్గొన్నారన్నారు. కాగా అందులో ప్రతిభ చూపి ప్రథమ బహుమతి సాధించిన ఆష్లాను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు వైస్‌ప్రిన్సిపాల్ నరేంద్ర, కల్చరల్ కోఆర్డినేటర్ డా.ఉషారాణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎస్ షమ్సుఅక్తర్, తెలుగు అధ్యాపకులు డా.ధర్మమూర్తి, చరిత్ర అధ్యాపకులు డా.సంధ్యారాణి తదితర అధ్యాపక బృందం అభినందించారు.

చిత్తూరులో ఉచిత డిఎస్సీ శిక్షణ కేంద్రం

- ఎమ్మెల్యే గురజాల చొరవతో ఏర్పాటు

చిత్తూరురూరల్, నవంబరు13 ప్రభాతవార్త:

రాష్ట్రప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న మెగా డిఎస్సీ కోసం ప్రభుత్వ పరంగా ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చొరవతో చిత్తూరులో ఏర్పాటు చేయనుండడంతో వేలాదిమంది నిరుద్యోగ బిసి,ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వరంగా మారింది. గతంలో ప్రభుత్వ పరంగా జరిగే శిక్షణా తరగతులన్నీ తిరుపతి కేంద్రంగా నిర్వహించడం జరిగేది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం ద్వారా శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఉచిత శిక్షణ కేంద్రాన్ని చిత్తూరులో ఏర్పాటు చేయాలని కోరుతూ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారాలోకేష్‌ను కలసి విన్నవించారు. దీంతో మంత్రి జిల్లాలో ఉచిత డిఎస్సీ శిక్షణా కేంద్రం ఏర్పాటుచేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత శాఖ అధికారులను ఆదేశించడంతో అధికారులు జిల్లాలో బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బిసి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి ధరఖాస్తులను ఆహ్వానించారు. కాగా చిత్తూరులో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉచిత డిఎస్సీ శిక్షణ కేంద్రం ఏర్పాటు కావడంపై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి డివిజన్

ఎస్‌డికె నగర్ రోడ్డుకు మోక్షమెప్పుడు?

శ్రీకాళహస్తి,నవంబర్ 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని ఎస్‌డికె నగర్ ప్రధాన రోడ్డు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.చినుకు పడితే చిత్తడిలా మారింది.మున్సిపల్ కమిషనర్‌గా అజయ్‌కిషోర్ పరిచేసిన సమయంలో ఎస్‌డికె నగర్ సగం దారికి సిమెంటు రోడ్డు నిర్మించారు. తరువాత సుమారు 10సంవత్సరాలుగా వచ్చిన కమిషనర్లు పట్టించుకోవటం లేదు.గత ప్రభుత్వ హయాంలో రూ.99లక్షలతో మురుగునీటి కాలువలు ఇటు అటు నిర్మించారు.ఈ కాలువలతో అయ్యల నాడు చెరువు వర్షపు నీటిని మళ్ళిస్తున్నారు.అయితే ఈ కాలువ నిర్మాణం రోడ్డుకంటే రెండు అడుగులు ఎత్తు నిర్మించారు. దాంతో సిమెంటు రోడ్డు గతుకుల మయం కాగా మట్టి రోడ్డు చినుకుపడితే చిత్తడి అన్నట్లు మారింది.ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతున్న ప్రాంతం.అయితే మున్సిపాలిటి ఇక్కడ ప్రజల నుంచి లక్షలకు లక్షలు పన్నులు వసూళ్ళు చేసుకుంటున్నారు.కానీ అభివృద్ధి గురించి ఒక్క కాణి కూడా కేటాయించటం లేదు.ఏళ్ళ తరబడి ప్రదాన రోడ్డుకే దిక్కులేదు. ఇక కాలనీలో లేన్లు పరిస్థితి సరే సరి.ఈ ప్రాంతం నుంచి పాఠశాలలు,కళాశాలలకు వెళ్ళు పిల్లలు, ఆటల క్లబ్‌లకు వెళ్ళు ఆటగాళ్ళు పట్టణంలో కొనుగోళ్ళకు వెళ్లు ప్రజలు ద్విచక్రవాహనాలు జారి పడుతున్నారు. నాయకులు ఎ న్నికల్లో ఓట్లకు తప్ప తరువాత తిరిగి చూడరు. మున్సిపల్ అధికారులు రెగ్యూలరైజేషన్ పేర లక్షల కు లక్షలు వసూళ్ళు చేసుకుంటారు.కానీ కనీసం ఇక్కడ తిరిగి చూడరు. దాంతో అభివృద్ధి చెందుతున్న ఎస్‌డికె నగర్ దీన స్థితికి చేరుకుంటుంది. రహదారులు నాగరికతకు నిదర్శనం అంటారు.అలాంటిది ఎస్‌డికె నగర్‌లో బహుళ అంతస్థుల భవనాలు కానీ నడవటానికి కూడా వీలు లేని దారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లా కలెక్టర్‌చే బాల సుబ్రహ్మణ్యంకు ప్రశంసాపత్రం

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 13, ప్రభాతవార్త:

ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలు అందించిన కయ్యూరు బాల సుబ్రహ్మణ్యంను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వ ం అభినదించారు. రాష్ట్ర పాఠశాల విద్యా కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ చాంబర్ నందు జిల్లా విద్యాశాఖ అధికారి కె. వి. యన్ కుమార్ తో కలసి జిల్లా కలెక్టర్ తిరుపతి జిల్లా, తొట్టంబెడు మండలం, దిగువ సాంబయ్యపాళ్యం ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కయ్యూరు బాల సుబ్రహ్మణ్యం ప్రశంసాపత్రంను జిల్లా కలెక్టర్ అందజేసి దుశాలువాతో సన్మానించారు.

ఎన్డీయే ప్రభుత్వంతో రైతులకు మేలు

గంజి మాధవయ్య

పుత్తూరు, నవంబరు 13 ప్రభాతవార్త :

రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతోందని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్, పుత్తూరు మాజీ ఎంపిపి గంజి మాధవయ్య అన్నారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశాల మేరకు బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గోపాలకృష్ణాపురం సచివాలయ పరిధిలో సబ్సిడీ వేరుసెనగ విత్తనాలను ఆయన రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు అవసరాలకు తగినంతగా సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ కాలేదని పర్యవసానంగా రైతులు బహిరంగ మార్కెట్లో విత్తన కాయలు కొనుగోలు చేయడం వల్ల ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులకు అవసరాలకు తగినట్టుగా విత్తనాలను సరఫరా చేస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అన్నదాత సుఖీభవకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఇ రమేష్‌రాజు, ఎఒ ఎస్.కోదండయ్య, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇ.మురళి, టిడిపి రూరల్ విభాగం ప్రధాన కార్యదర్శి ఎ.బాలాజీ, నాయకులు బాలకృష్ణారెడ్డి, చిన్న, గాలి బాబు, గంగాకుమార్, హరిగోపాల్, మోహన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 13, ప్రభాతవార్త

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన పేదల కోసం నిర్మిస్తున్న గృహాల పురోగతిపై కమిషనర్ ఎన్.మౌర్య గృహ నిర్మాణ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న గృహ నిర్మాణ, నగరపాలక సంస్థ అధికారులు ఆరు లేఔట్లలో నిర్మాణంలో ఉన్న గృహాల పురోగతిని కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన పేదలకు ఇచ్చిన ఇండ్ల నిర్మాణంలో పెండింగ్ ఉన్న వాటి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లే ఔట్లలో మౌళిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఆమరయ్య, గృహ నిర్మాణ శాఖ డి.ఈ.లు శ్రీనివాస రావు, మోహన్, ఏ.ఈ.లు, హౌసింగ్ స్పెషలిస్ట్ కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారస్తులు తప్ప

మరెవ్వరూ గుత్తేదారునికి రుసుము చెల్లించొద్దు : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 13, ప్రభాతవార్త

తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలో కూరగాయలు, పళ్ళు, పూల వ్యాపారస్తులు తప్ప మరెవ్వరూ ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ గుత్తేదారునికి ఎటువంటి రుసుము చెల్లించవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో పలు వ్యాపారస్తుల వద్ద ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ గుత్తేదారుడు రుసుము వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు అందాయని తెలిపారు. ఈ మేరకు నగర పాలక సంస్థ పరిధిలో వ్యాపారం చేస్తున్నటువంటి కూరగాయలు, పళ్ళు, పూల వ్యాపారస్తులు తప్ప మిగిలిన చిరు వ్యాపారులు ఎవ్వరు కూడా ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్టు గుత్తేదారునికి ఏ విధమైన రుసుములు చెల్లించలసిన అవసరం లేదని నగర పాలక సంస్థ కమిషనర్ తెలిపారు. అలా ఎవరైనా వసూళ్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిరుపతి గ్రేటర్ లయన్స్ క్లబ్‌చే ప్రసూతి ఆసుపత్రికి సిమెంట్ బెంచ్‌లు వితరణ

తిరుపతి హెల్త్, నవంబర్ 13, ప్రభాతవార్త

తిరుపతి గ్రేటర్ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం తిరుపతి ప్రసూతి ఆసుపత్రి వెలుపల రోగి, రోగి బందువులు ఆసుపత్రి బయట కూర్చునేందుకు 22 సిమెంట్ బెం

తిరుపతి డివిజన్

అమరా హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చంద్రగిరి, నవంబర్ 13 ప్రభాతవార్త:

అమరా మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. తిరుపతి, కరకంబాడి వద్ద గల అమరా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరినేని వారి ప్రత్యేక చొరవతో చంద్రగిరి గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయ్స్ బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన రోగులకు ఈసిజి, మధుమేహం, రక్తపోటు వంటి పరీక్షలకు చితంగా నిర్వహించారు. అదేవిధంగా సాధారణ జబ్బులు, గుండె జబ్బులు, ఎముకలకు సంబంధించిన రోగులకు డాక్టర్ లోకేష్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ మోహన్‌రావు (కార్డియాలజిస్ట్), డాక్టర్ రవికుమార్ (ఆర్థోపెడిక్ – మోకాలి మార్పిడి సర్జన్) ఆధ్వర్యంలో రోగులకు పరీక్షించి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరంలో 150 మంది వైద్య సేవలకు హాజరయ్యారు. వీరిలో 15 మందిని మెరుగైన వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు కోసం అమరా హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అమరా హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ డి.పరమేశ్వర్ రెడ్డి పర్యవేక్షించారు.

గ్రీవెన్స్ పిటీషన్లను త్వరితగతిన పరిష్కరించండి..!

ఆర్డీఓ రామ్మోహన్

చంద్రగిరి, నవంబర్ 13 ప్రభాతవార్త: ప్రజలు తమ సమస్యలపై అందజేసే గ్రీవెన్స్ పిటీషన్లను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ రామ్మోహన్ తహశీల్దార్ శివసుబ్బరామయ్యను ఆదేశించారు. సాధారణ పరిశీలనలో భాగంగా బుధవారం ఆర్‌డిఓ చంద్రగిరి రెవెన్యూ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ పిటీషన్లతో పాటు రోజూవారీ సర్టిఫికెట్స్ రికార్డులను పరిశీలించారు. రెవెన్యూకు సంబంధించిన పలు అంశాలను అడిగితెలుసుకున్నారు. వివరాలు తెలుసుకున్న ఆయన తహశీల్దార్‌తో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ సురేష్‌బాబు, ఏఎస్ఓ స్వర్ణలత, ఈసిడిటి మహేశ్వరి, విఆర్ఓలు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

వరుస చోరీలతో పోలీసుల పరేషాన్

చంద్రగిరి, నవంబర్ 13 ప్రభాతవార్త: దొంగలు బాబోయ్ దొంగలు అంటూ చంద్రగిరి మండల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. స్థానిక ప్రశాంత్ నగర్‌కు చెందిన ఆదిని పూర్ణసాయితేజ నివాసంలో ఆదివారం రాత్రి చోరీ జరిగిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం రాత్రి ఐతేపల్లి వద్ద జాతీయ రహదారి ప్రక్కన గల ఏజి పల్లి, మేడసాని రేణు చౌదరికి చెందిన బేబి ప్రొవిజన్ స్టోర్‌లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుకాణానికి ముందు గల సిసి కెమెరాలను నిందితులు ధ్వంసం చేసి లోనికి చొరబడి రూ.70 వేలు నగదును దోచుకుపోయారు. ముఖానికి మంకీ క్యాప్‌లు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు పల్సర్ బైక్‌పై పారిపోయినట్లు సిసి ఫుటేజీ ద్వారా తెలుసుకున్నారు. అదేవిధంగా నాగాలమ్మ మలుపు బైపాస్ వద్ద నవీన్ రెడ్డికి చెందిన ఎరువుల దుకాణంలో షట్టర్‌ను పగులగొట్టి రూ.5 వేలు దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వరుస చోరీలతో పోలీసులు పరేషాన్ అవుతున్నారు.

నేటి నుండి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గ్రంథాలయ అధికారి రెడ్డెమ్మ

చంద్రగిరి, నవంబర్ 13 ప్రభాతవార్త:

స్థానిక పాతపేటలోని లైబ్రరీలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎ.రెడ్డెమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 14 నుండి 20 వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఇందులో కవిసమ్మేళనాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చట్టంపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రంథాలయం నుండి అద్దెకు బుక్స్ తీసుకున్న వారు తిరిగి అందజేస్తే ఆలస్య రుసుము వసూలు చేయబోమని ఆమె పేర్కొన్నారు.

కాకినాడ మహిళ అదృశ్యం

శ్రీకాళహస్తి, నవంబర్ 13 ప్రభాతవార్త

కాకినాడ తూరంగి శివాలయంకు తన కుమార్తెతో కలసి వెళ్ళిన తులసీదేవి కనిపించకుండాపోయిందని శ్రీకాళహస్తి పోలీసులకు సమాచారం అందిందని అర్బన్ సిఐ గోపి తెలిపారు. కుమార్తె, చిన్నారి ఎవరికైనా కనిపించినా వెంటనే ఇంద్రపాశెం ఎస్ఐకు తెలియజేయాలని సిఐ కోరారు. లేదా 9440796555, 9640222227, 9951766722 నంబర్లకు పోన్ చేయాలని తెలిపారు.

కాణిపాకంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

కాణిపాకం, నవంబర్ 13 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఈమేరకు ఆలయ అలంకార మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద ఉదయం 9 గంటలకు విశేషసంధి, రెండవకాలపూజ స్థండిల మండలేశ్వర పూజ, పూజ, వత్ర సమర్పణ, రెండవ కాల వత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి, ద్రవ్యాహుతి, ప్రసాద వినియోగం, సాయంత్రం 5 గంటలకు విశేషసంధి, మూడవకాలపూజ, స్థండిల మండలేశ్వర పూజ, హోమం, వ్రత సమర్పణ, మూడవ కాల వ్రతసమర్పణ, విశేష ద్రవ్యాహుతి, దీపారాధన, ప్రసాద వినియోగం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ప్రధాన అర్చకులు గణేష్ గురుకుల్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీ రవాణా లారీ సీజ్

కాణిపాకం, నవంబర్ 13 ప్రభాతవార్త:

ఎటువంటి అనుమతులు లేకుండా గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీని బుధవారం సజ్ చేసినట్లు కాణిపాకం ఎస్సై ధరణీధర తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీల్లో భాగంగా ఎటువంటి అనుమతులు, దృవీకరణ పత్రాలు లేకుండా గ్రానైట్‌ను తరలిస్తున్న లారీని పట్టుకుని సజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా క్వారీలు నడిపినా, అక్రమ రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై ధరణీధర హెచ్చరించారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

డ్వాక్రా ఉత్పత్తుల డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించండి

కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 13, ప్రభాతవార్త

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తుల ఆన్లైన్ విక్రయాల కొరకు ప్రభుత్వం నూతన యాప్ ప్రవేశపెట్టినట్లు కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. నూతన ఆన్లైన్ యాప్, డ్వాక్రా ఉత్పత్తులపై నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా అధికారులతో బుధవారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తయారు చేసే వివిధ వస్తువులను డిజిటల్ మార్కెటింగ్ చేయించేందుకు ప్రభుత్వం అమెజాన్, ఫ్లిప్ కార్డ్ యాప్ వలె ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించిందని అన్నారు. ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్, ఆన్లైన్ ప్లాట్ఫామ్ పై ఈ యాప్‌ను రూపొందించడం జరిగిందనీ అన్నారు. ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌లో మై స్టోర్ అనే ఆప్‌ను డౌన్లోడ్ చేసుకుంటే ఉచితంగా కొనుగోలు ప్రక్రియ ప్రారంభించవచ్చునని తెలిపారు ఈ యాప్ లో బుక్ చేసుకున్న వస్తువులను ఏడు రోజుల్లోపు కొనుగోలుదారులకి డెలివరీ చేసేలా రూపొందించబడిందని తెలిపారు. కాగా యాప్ లో కొనుగోలుదారులు కొనుగోలు చేస్తే ఆ నగదు నేరుగా డ్వాక్రా మహిళల బ్యాంక్ ఖాతాలోకి జమ అయ్యేలా రూపొందించడం జరిగిందన్నారు. ఈ యాప్ వినియోగించడం వలన కలిగే లాభాలను ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమోళి, మెప్మా పి.డి. రాధమ్మ, సి.ఎం.ఎం.లు కృష్ణ వేణి, సోమకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంటెక్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి విద్య, నవంబర్ 13, ప్రభాతవార్త:

పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎంటెక్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సీఎస్ఈ(ఏఐ అండ్ డీఎస్)లో 14 ఖాలీలు, ఈసీఈ(డబ్లూ సీ) లో 23, ఈఈఈ(పిఈడీఆర్)విభాగంలో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలియజేశారు. ఆసక్తి అర్హత గల మహిళా అభ్యర్థులు గురువారం నుంచి ఈ నెల 17వ తేదీలోపు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఇంజనీరింగ్ కళాశాలలో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్సైట్ను సంప్రదించాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు - అర్బన్ సీఐ

రేణిగుంట, నవంబరు 13 ప్రభాతవార్త:

మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా చర్యలు కఠినంగా ఉంటాయని రేణిగుంట అర్బన్ సీఐ శరత్‌చంద్ర హెచ్చరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ, అర్బన్ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో శనివారం వాహనాలను, బహిరంగప్రదేశాల్లో భద్రత కోసం తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వామనాలు నడుపుతున్న 5 మందిని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని పోలీసులు న్యాయస్థానం ముందు హాజరు పరచగా మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒక్కొక్కరికి పది వేలు జరిమానా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారికి ఒక్కొక్కరికి 1100 రూపాయలు వంతున ఫస్ట్‌క్లాస్ ఏజేసీ ఏజేసీజే న్యాయస్థానం న్యాయమూర్తి జరిమానాలు విధించారు. సీఐ శరత్‌చంద్ర ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ ఎంతటి వారైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే సహించమన్నారు. నో పార్కింగ్ స్థలాల్లో వాహనాలు పార్కింగ్ చేయకూడదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని, ద్విచక్రవాహనాల్లో త్రిబుల్ రైడింగ్ చేయకూడదన్నారు. మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడితే వారు తల్లిదండ్రులు, వాహనం ఇచ్చిన వారు బాధ్యులవుతారన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

ఆశ్రమ ఆవరణలో భాగవత పారాయణం

శ్రీకాళహస్తి, నవంబర్ 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ఆధ్యాత్మికనిలయం. ఇక్కడ దేవాలయంలోనే కాదు. పలు ధార్మిక సంస్థలు ఆధ్యాత్మిక చింతనతో సనాతన సభలు, సప్తాహాలు నిర్వహిస్తున్నారు. ఈనేఎధ్యంలో శ్రీకాళహస్తికి సమీపంలో పవిత్ర జీవనది సువర్ణముఖి తీరాన సుమారు 55 సంవత్సరాల క్రితం వెలసిన శుకబ్రహ్మాశ్రమం సారధ్యంలో సప్తాహాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సప్తాహం ఆశ్రమంలోని వ్యవస్థాపకులు విద్యాప్రకాశానంద ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసారు. బుధవారం ఓ వైపు వర్షం కురుస్తున్నా ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు, పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి మాట్లాడుతూ కార్తీక మాసం ఆశ్రమంలో మహాభాగవత పారాయణం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు పట్టణ ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమాలు ఈనెల 15 పౌర్ణమి రోజు ముగుస్తుందన్నారు. ఆ రోజు సామూహిక వనభోజనం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఒంగోలు చిన్మయ విషన్ అధిపతి సత్యాత్మానంద స్వామి సారధ్యంలో భాగవత పురాణం సప్తాహం నిర్వహించటం అభినందనీయం అన్నారు. అయితే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్తీక పౌర్ణమి రోజు పూర్ణాహుతి, గురు పాదుకా పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని విద్యాస్వరూపానందగిరి స్వామి వివరించారు.

స్కూల్ అసిస్టెంట్ హఠాన్మరణం

శ్రీకాళహస్తి రూరల్, నవంబర్ 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడు పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఉపాధ్యాయిని బుధవారం హఠాన్మరణం చెందారని, ఆమెకు పాఠశాల ఉపాధ్యాయ బృందం నివాళులర్పించారు. వెల్లంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కామేశ్వరి స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. బుధవారం ఆమె హఠాన్మరణం చెందినట్లు తెలిపారు. ఆమె మృతికి పాఠశాల ఉపాధ్యాయ వర్గంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు సంతాపం తెలిపారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

.శ్రీకాళహస్తి, నవంబర్ 13 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీసభ్యత్వ నమోదు కార్యక్రమం పట్టణంలోని 22వ వార్డు యూనిట్ ఇన్‌ఛార్జి నెమళ్ళూరుబుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జలసుధీర్‌రెడ్డి ఆదేశాలతో క్లస్టర్ ఇన్‌ఛార్జి గెడిపూడివిజయకుమార్ సూచనలతో టిడిపి సభ్యత్వ నమోదు స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి) మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌లు కార్యకర్తల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశంపార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు అనుకోని ప్రమాదాలు జరిగితే వారి కుటుంబం అనాధలు కాకుండా వారి కుటుంబాలను ఆదుకునే విధంగా ప్రమాదబీమాను రూ.5లక్షలు అందించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. అలాగే సాధారణ మరణం జరిగితే ఖర్చులకు రూ.10వేలు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈసభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని బుజ్జి తెలిపారు. కార్యక్రమంలో తెదేపా కార్యకర్తలు ఎం.శివకుమార్, తేజ, నరేష్, పసుపులేటి శంకరయ్య, రమణయ్య, కాలేషా, ముబారక్, విమలమ్మ, లైలా తదితరులు పాల్గొన్నారు.

కన్నలి వెంకటసుబ్బారెడ్డి భౌతికకాయానికి ఎంఎల్ఏ నివాళులు

.తొట్టంబేడు, నవంబర్ 13 ప్రభాతవార్త

మండలంలోని పెద్దకన్నలి గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ నాయకులు కన్నలి ప్రతాప్‌రెడ్డి, కన్నలి ప్రవీణ్‌రెడ్డి తండ్రి కన్నలి వెంకటసుబ్బారెడ్డి బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి, సతీమణి బొజ్జలరిషితారెడ్డిలు గ్రామానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో టి.ప్రకాష్‌నాయుడు, శ్రీకాళహస్తి జడ్పీటిసి వెంకటసుబ్బారెడ్డి, మాజీ జడ్పీటిసి వెంకటాచలం, దుర్గాప్రసాద్, బాలాజీరెడ్డి పలువురు నాయకులు నివాళులు అర్పించారు.

రోడ్డుకడ్డంగా వాహనాలు: స్పందించిన పోలీసులు

శ్రీకాళహస్తి, నవంబర్ 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని ఇరుకు రోడ్లు ఆ పై కొందరు హోటల్ యజమా నులు వ్యాపారం. ఈ నేపథ్యంలో రామ సేతు వంతెన పక్కన పంచాయతీరాజ్ అతిథి గృహం ఎదురుగా ఓ హోటల్ నిర్వాహకులు తమ హోటల్‌కు వచ్చే వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేసి రాకపోకలకు అంతరాయం కల్గిస్తున్నా పట్టించుకోకుండా తమ వ్యాపారం సాగించుకుంటున్నారు. ఇక్కడ ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సంఘటనపై బుధవారం దుమారంలేచింది. దాంతో స్పందించిన పోలీసులు అక్కడ రోడ్డు మార్జిన్‌కు బారికేడ్లు ఏర్పాటు చేసారు. ఇక్కడ ప్రజలకు అరోధం కల్పిస్తున్నారని పోలీసులు ఏడుగురుపై న్యూసెన్స్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు సిఐ డి.గోపి వివరించారు. అలాగే ఆరోపణలు రావటంతోనే ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న వెంకటేశ్వర్లు, మునస్వామిలు సిఐ గోపి ఆదేశాలతో అక్కడకు చేరుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసారు హోటల్ యజమానిని మందలించారు. వంటకాలు గదుల లోపలు చేసుకోవాలని రోడ్డు మీద ఏర్పాటు చేస్తే ఎలా అని మరో సారి ఇలా జరిగితే కేసు నమోదు చేస్తామంటూ హెచ్చరించారు.

అరేబియన్ కబాబ్ సెంటర్‌ను పట్టించుకోరా?

శ్రీకాళహస్తిలోని పెద్ద మసీదు వీధిలో రాకపోకలు ఇబ్బందిగా మారింది. పోలీసులు ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌ను రిపబ్లిక్ క్లబ్ కూడలి నుంచి జయరామారావు వీధి కూడలి వరకు పెద్దమసీదు వీధి నుంచి నడుపుతున్నారు. అయితే ఈ వీధిలో ఓ కాబాబ్ సెంటర్, బిరియాని సెంటర్, ఎదురుగా సైకిల్‌షాప్, పక్కనే ఓ ఎంటర్‌ప్రైజస్, ఇక్కడ ఓ కళాశాల, మరో అల్పాహార సెంటర్, ఓ ప్రవైటే ఫైనాన్స్ కంపెనీలు, ఓ ఫ్రూట్ షాప్, స్వీట్ స్టాల్స్ ఉన్నాయి. 20 అడుగుల రోడ్డుపై నడిరోడ్డుపై హోటల్ వద్ద ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయటం వల్ల ప్రతినిత్యం ప్రజలు ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ మార్గంలో వెళ్లు పోలీసులు కూడా గంటల తరబడి నిరీక్షిస్తారు తప్ప ఆ హోటల్, వ్యాపారసంస్థల యజమానులను మందలించరు. ప్రశ్నించరు. దీనిని గురించి కూడా పోలీసులు పరిశీలిస్తే బాగుంటుంది.

దొంగతనం కేసులో ఇద్దరికి 4నెలల జైలు శిక్ష

నారాయణవనం, నవంబర్ 13 ప్రభాతవార్త :

ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలకు పుత్తూరు కోర్టు 4నెలల జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు పూర్తి వివరాలు ఇలా వున్నాయి. మండలకేంద్రంలోని నారాయణవనం దిగువ పద్మశాలీ వీధికి చెందిన రూపేష్‌కుమార్ కుటుంబసభ్యులు జూలై 16వ తేది ఓ వివాహానికి వెళ్లారు. ఇంటికి తాళ వేసి వెళ్లిన రూపేష్ కుటుంబసభ్యులు లేదని తెలుసుకున్న తమిళనాడు రాష్ట్రం నీలగిరి జిల్లా ఊటీ సమీపం గుడ్డలూరుకు చెందిన మహేష్ (43), వెస్ట్ గోదావరి జిల్లా తంగేళ్లమూడికి చెందిన షేక్ మోహీద్దీన్(38)లు పథకం ప్రకారం ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాలోని నగలు, వెండి అభరణాలు, టివిని దొంగతనం చేశారు. కేసు నమోదు చేసిన చేసిన తర్వాత చోరికి పాల్పడి వారిని గుర్తించి విచారించి వారి నుంచి నిజాన్ని రాబట్టారు. దొంగతనం చేసిన వీరి నుంచి 64 గ్రాముల బంగారం, 296 వెండి, టీవీని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

మద్యం విక్రయదారుడు అరెస్ట్

తిరుపతిరూరల్, నవంబర్13 ప్రభాతవార్త:

మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని తిరుపతిరూరల్ ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసారు. అతని దగ్గర నుండి 12 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిరూరల్ సి.ఐ. నరసానాయుడు తెలిపిన వివరాలు మేరకు మండల పరిధిలోని కుంట్రపాకం మాదిగవాడకు చెందిన రామారావు (41) గత కొద్దిరోజులుగా అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎక్సైజ్ పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేసి, అతన దగ్గర ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు, అరెస్ట్ చేసిన నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు కవీశ్వరనాయుడు, అంజలిప్రసన్న, కానిస్టేబుల్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

తిరుపతిరూరల్, నవంబర్13 ప్రభాతవార్త:

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు అన్నమయ్య సర్కిల్ వద్ద వున్న గ్రేడ్-1 గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి జె.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న గ్రంథాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న స్మరించుకొనుట, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయ పఠనం, వారోత్సవాలు ముగింపు ఉంటుందని తెలిపారు.

సిద్ధ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్

వడమాలపేట, నవంబరు 13 ప్రభాతవార్త: సిద్ధ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ వ్యాదులను నయం చేసుకోవచ్చునని వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా. చక్రపాణి తెలిపారు. ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా మండలంలోని టీసీ అగ్రహారం గ్రామంలో కేంద్రియ సిద్ధ పరిశోధనా మండలి తిరుపతి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధ వైద్యం క్రమం తప్పకుండా పాటించి బీపీ, షుగర్, నరాల బలహీనత, కీళ్ళనొప్పులు, నయం చేసుకోవచ్చున్నారు. ఆహార నియమాలు, ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. బీపీ, షుగర్, నరాల బలహీనత, కీళ్ళ నొప్పులు, అజీర్తి, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్యామరాజు, అరుణాచలం, భాను, ప్రేమకుమార్, వెంకటముని, సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం కట్టారు : తేజోవతి

రేణిగుంట, నవంబరు 13 ప్రభాతవార్త:

భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడే ఏకైక పార్టీగా మండల బీజేపీ అధ్యక్షురాలు తేజోవతి అన్నారు. తన సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వన్నెకుల క్షత్రియ ఫైనాన్షియల్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్‌గా అవకాశం ఇవ్వడం ఆనందంగాఉందని ఆమె అన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి, సిఫార్సు చేసిన రాష్ట్ర బీజేపీ కార్యదర్శి కోలా ఆనందకుమార్, సామంచి శ్రీనివాస్, టీటీడీ బోర్డు మెంబరు, బీజేపీ సీనియర్ నేత భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీలకు ధన్యవాదాలు తెలిపారు. పదవి ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చ

గూడూరు డివిజన్

వ్యవసాయ సాగుపై అవగాహన

వాకాడు, నవంబర్ 13 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పొలం పిలుస్తుంది కార్యక్రమములో భాగంగా రైతులు కు వ్యవసాయ సాగు పై అవగాహన కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని వాకాడు వ్యవసాయశాఖ అధికారిని దీప తెలిపారు. బుధవారం మండలం లోని జమీన్ కొత్తపాలెం, గంగన్నపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి వలన కలుగు ప్రయోజనాలు, సీజన్లో నారు మడి, బీజామృతంతో విత్తన శుద్ధి, ఎరువుల వలన కలుగు ప్రయోజనాలుతో పాటు వివరించారు. పశువులు గొర్రెలు, మేకలు సీజనల్ వ్యాధులు నివారణ, రాయితీలు గురించి పశుసంవర్ధక శాఖ సిబ్బంది రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వ్యవసాయ సహాయకులు రాజశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో ఎఎన్ఎంలకు ప్రజలు సహకరించాలి

కోట, నవంబర్ 13 ప్రభాతవార్త : మధుమేహం, రక్తపోటుతో పాటు క్యాన్సర్ ముప్పు ప్రజలను వణికిస్తోందని కోట మండలం చిట్టేడు ఉప ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు చెప్పారు. ఆయన బుధవారం మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల సర్వే మూడో విడత గురువారం నుంచి ప్రారంభమవ ుతుందని తెలిపారు. ఎఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి 18 ఏళ్లకు పైబడిన వారికి మధుమేహం, హిమోగ్లోబిన్, నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలు చేస్తారన్నారు. మొదటిదశలో కనిపెట్టడం ద్వారా చికిత్సను రెండంచెల్లో అందిస్తారని తెలిపారు. లక్షణాలు ఉన్న వారికి తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో పరీక్షలు చేస్తారని తెలిపారు.

పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలి: సిఐ

కోట, నవంబర్ 13 ప్రభాతవార్త : ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ తదితర సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని వాకాడు సిఐ హుస్సేన్‌బాషా సూచించారు. బుధవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ వర్గాల మధ్య విద్వేషాలు రగిలించే విధంగా వ్యక్తిగత పేరుపైన ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని సూచించారు. అదే క్రమంలో సోషల్ మీడియా వేదికగా మతపరమైన సున్నిత అంశాలు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. అసభ్యకరమైన పోస్టులు పెట్టే వారిపై సైబర్‌సెల్ సోషల్ మీడియా విభాగంలో ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి లేదా ఫార్వార్డ్ చేసే వారిపై నిఘా ఉంచామని, నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో షేర్ చేసే వారిపై సంబంధిత గ్రూప్ అడ్మిన్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనాలోచితంగా పోస్టులు పెట్టడం వల్ల జరిగే కీడును గుర్తించాలన్నారు.

సిసి రోడ్ల నిర్మాణంపై అధికారుల సమీక్ష

తడ, నవంబర్ 13 ప్రభాతవార్త : తడ మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సిసి రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని నాయుడుపేట పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఎంజిఎన్ఆర్ జిఎస్ పథకం ద్వారా సిసి రోడ్లు నిర్మిస్తుండగా అన్ని గ్రామాల విలేజ్ వెండర్స్, పంచాయతీరాజ్ ఏఇ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సురేష్‌బాబు సమావేశం నిర్వహించారు. ఇప్పటికీ మొదలుకాని సిసి రోడ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విజయకుమార్‌లు పాల్గొన్నారు.

పేపర్ పేట్ల ఫ్యాక్టరీలో మంటలు!

నాయుడుపేట టౌన్, నవంబరు 13 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని తిమ్మాజికండ్రిగ గ్రామంలో ఉన్న పేపర్ పేట్ల ఫ్యాక్టరీలో బుధవారం మంటలు చెలరేగినట్లు బాధితురాలు కృష్ణవేణి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకొన్న అగ్నిమాపకశాఖ అధికారి శ్యామ్‌బాబు తన సిబ్బందితో కలిసి ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని మంటలు అదుపుచేశారు. అమ్మ ఫౌండేషన్ నిర్వహకురాలు కృష్ణవేణి మాట్లాడుతూ కొంత మంది దాతల సహకారంతో కొంత కాలం నుండి పేపర్ పేట్ల ఫ్యాక్టరీ నడుపుతున్నామని తెలియజేశారు. ఫ్యాక్టరీలో విద్యుత్ షాట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదం వల్ల సుమారు రూ.5లక్షల వరకు నష్టం జరిగినట్లు ఆమె తెలిపారు.

పేటలో పారిశుద్ధ్యం మెరుగుపరచండి : కమిషనర్

నాయుడుపేట టౌన్, నవంబరు 13 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచే విధంగా అధికారులు పనిచేయాలని మున్సిపాల్టీ కమిషనర్ ఫజలుల్లా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం మున్సిపాల్టి కార్యాలయంలో పలుశాఖల అధికారులతో పారిశుధ్యంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో శానిటేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా పట్టణంలో మురికినీరు నిల్వచేరకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నాయుడుపేట పట్టణంలో ఎక్కడ విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్లు, వైద్యాధికారులు, మున్సిపాల్టి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడే సర్వసభ్య సమావేశం : ఎంపిడిఓ

నాయుడుపేట టౌన్, నవంబరు 13 ప్రభాతవార్త : నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ సురేష్‌బాబు బధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అధికారులు అందరు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

స్నేహితులే హత్యచేసేందుకు కుట్ర!

పుంగనూరు రూరల్, నవంబరు 13 ప్రభాతవార్త : ప్రమాదంలో ఉన్నామని పిలిచి హత్యచేయడానికి కొందరు ప్రయత్నించగా ఒక యువకుడు ప్రాణాలతో బయటపడిన ఘటన పుంగనూరులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఏసుబాబు కుమారుడు రఫీక్ అనే యువకుడికి మంగళవారం రాత్రి 11 గంటలకు స్నేహితుల వద్దనుంచి ప్రమాదంలో గాయపడ్డామని, రక్షించమని ఫోన్ వచ్చింది. వారి పిలుపు మేరకు గూడూరుపల్లి వద్ద ఉన్నవారి వద్దకు రఫిక్ వెళ్ళాడు. అతనిపై స్నేహితులు రోషన్, ముబారక్, షానవాజ్‌లు కత్తులతో దాడిచేసి పారిపోయారు. ప్రమాద పరిస్థితిలో ఉన్న రఫీక్‌ను స్థానికులు గుర్తించి 108 ద్వారా వైద్యశాలకు తరలించారు. స్పృహలోకి వచ్చిన తరువాత రఫీక్ తనపై జరిగిన దాడిని పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

చంద్రబాబును కలసిన ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, నవంబర్ 13 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వక ంగా కలిశారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలోని సిఎం కార్యాల యంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ సిఎంను కలసి తనకు శాసనమండలి విప్‌గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ, విప్ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

నాయుడుపేటలో ఆగిన జముతావి ఎక్స్‌ప్రెస్

నాయుడుపేట టౌన్, నవంబరు 13 ప్రభాతవార్త : చెన్నై సెంట్రల్ నుండి జమ్మూకశ్మీర్ వెళ్లె జముతావి ఎక్స్‌ప్రెస్ నాయుడుపేట రైల్వేస్టేషన్‌కి వచ్చేసరికి సాంకేతిక లోపం కారణంగా జముతావి ఎక్స్‌ప్రస్ రైలును అధికారులు నిలిపివేయడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రామగుండం-పెద్దపల్లి వద్ద రైల్వేట్రాక్ మరమ్మతులు కారణంగా ఎక్స్‌ప్రస్ రైలును నిలిపివేసినట్లు అధికారులు తెలియజేశారు. మధ్యాహ్నం 1గంటకు జముతావి ఎక్స్‌ప్రెస్ నాయుడుపేట నుండి బయలుదేరి వెళ్ళింది. ఉదయం నుండి నాయుడుపేట రైల్వేస్టేషన్ వద్ద జముతావి ఎక్స్‌ప్రస్ రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు కొంతవరకు ఇబ్బంది పడాల్సివచ్చింది.

పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళిక చేసుకోవాలి

వాకాడు, నవంబర్ 13 ప్రభాతవార్త : పంచాయతీలు అభివృద్ధి చెందే విధంగా ప్రణాళిక రూపకల్పన చేసుకోవాలని ఏఎంసీ మాజీ ఛైర్మన్, సీనియర్ రాజకీయ నాయకుడు కొడవలూరు దామోదర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని ఉన్న స్త్రీశక్తి భవనములో స్థానిక సంస్థ ప్రతినిధులు, మండల స్థాయి ఉద్యోగులతో 2025 -26లో జరగబోవు అభివృద్ధి ప్రణాళిక పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో అన్నపూర్ణ రావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ శిక్షణ సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులతో దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయ భాస్కర్‌రెడ్డి, సర్పంచులు సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, విజయ్‌రెడ్డి, బండి వెంకట రత్నమ్మ, ఎంపీటీసీలు, ఈ వో పి ఆర్ డి ఉమామహేశ్వరరావు, మండల స్థాయి వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగితే చర్యలు : డ్వామా పిడి

బాలాయపల్లి, నవంబర్ 13 ప్రభాతవార్త : ఉపాధి పనిలో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని డ్వామా శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని అలిమిలి ఎస్సీ కాలనీలో 10 లక్షల అంచనా విలువ కలిగిన సిమెంట్ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అదే విధంగా పశువులు షెడ్ అంబలపూడి గ్రామంలో పరిశీలించడం జరిగినది. సిమెంట్ రోడ్లు ఇతర పనులు నాణ్యతగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ఉన్న కూలీలందరికీ పనులు కల్పించాలని కోరారు. మండలంలో 41 సిమెంట్ రోడ్డు పనులు రెండు కోట్ల ఆరు లక్షల రూపాయలు, పశువుల షెడ్లు 38మందికి శాంక్షన్ కావడం మంజూరైనట్లు తెలిపారు. పనులన్నీ డిసెంబర్ ఆఖరి లోపల పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడి వెంట పంచాయతీరాజ్ ఏ ఈ హేమంత్ కుమార్, ఏపీవో మృత్యుంజయరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతులకు స్మార్ట్ మీటర్లను బిగిస్తే ఆందోళన : సిపిఎం

వెంకటగిరి, నవంబర్ 13 ప్రభాతవార్త : రైతులకు స్మార్ట్ మీటర్లను బిగిస్తే ఆందోళన చేస్తామని సిపిఎం కన్వీనర్ వడ్డీపల్లి చెంగయ్య తెలిపారు సిపిఎం పార్టీ వెంకటగిరి నియోజకవర్గ ప్రథమ మహాసభ వెంకటగిరి సిపిఎం ఆఫీస్ వద్ద జరిగింది. వెంకటగిరి, దక్కిలి, బాలాయపల్లి మండలాల నుండి పార్టీ సభ్యులు మహాసభలో పాల్గొనడం జరిగింది. సిపిఎం పార్టీ తిరుపతి జిల్లా సీనియర్ నాయకులు జి బాలసుబ్రమణ్యం, ఆర్ లక్ష్మిలు పాల్గొనడం జరిగింది. ఈనెల 14వ తేదీ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పోరు కార్యక్రమం పేరుతో అన్ని మండల కార్యాలయాల వద్ద జరుగు ధర్నాలు జయప్రదం చేయాలని పిలుపు నివ్వడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ వెంకటగిరి నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నియోజకవర్గ కన్వీనర్‌గా వడ్డిపల్లి చెంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ సభ్యులుగా భాస్కర్, గజ్జల రాజగోపాల్, స్వర్ణక్క, ఉదయంలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మొత్తం ఐదు మందితో కమిటీ ఏర్పాటు అయింది. సిపిఎం సీనియర్ నాయకులు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కమిటీ ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలను కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు చల్ల సుబ్బరాయులు, స్వరాజ్యం, చంద్రశేఖర్ కృష్ణయ్యలు పాల్గొనడం జరిగింది.

శ్రీకృష్ణ అలంకరణలో అయ్యప్ప స్వామి

వెంకటగిరి, నవంబర్ 13 ప్రభాతవార్త : పట్టణంలోని మల్లమ్మ గుడి వద్ద కలిసి ఉన్న ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి శ్రీకృష్ణుని అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. అయ్యప్ప స్వామికి శ్రీకృష్ణుని అలంకరణ చేశారు. మాల ధరలో ఉన్న భక్తులు ప్రజలను చేసే పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం

గూడూరు, నవంబర్ 13 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని కాశీ లేఔట్ లో నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి స్వాములు, భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో 48 రోజులపాటు ఉదయం స్వామి వారికి అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూజలు ప్రసాదాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు విచ్చేసి జయప్రదం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

చెందోడులో పొలం పిలుస్తోంది

కోట, నవంబర్ 13 ప్రభాతవార్త : కోట మండలం చెందోడు గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిరంజన్ కుమార్ మాట్లాడుతూ సబ్సిడీలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధాం కార్డుతో రైతు సేవా కేంద్రానికి వెళ్లాలని సూచించారు. బయోమెట్రిక్ విధానంలో రైతులకు విత్తనాలు అందజేస్తామన్నారు. అలాగే యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. వరిలో విత్తనశుద్ధి చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బిసిల బాంధవుడు చంద్రబాబు

- టిడిపి నేత తీగల సురేష్‌బాబు

కోట, నవంబర్ 13 ప్రభాతవార్త : బిసిల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, బిసిల బాంధవుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని టిడిపి బిసి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం కోటలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ బిసిల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.39,007 కోట్లు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అంటే బిసిలు అని, బిసిలు అంటే తెలుగుదేశం అనేంతగా టిడిపితోనే అనుబంధం ఉందన్నారు. తెలుగుదేశం ఎప్పుడు అధికారంలో ఉన్నా బిసిల సంక్షేమానికి నిధులు అధికంగా ఖర్చు పెడుతుంద న్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే కార్పొరేషన్లకు ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమించడమే కాకుండా నిధులను కూడా కేటాయించారని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి బిసిలను అణగదొక్కారని, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి కేటాయించిన నిధులన్నీ దారిమళ్లించారని ఆరోపించారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా దుర్గి రమేష్

సూళ్లూరుపేట, నవంబర్ 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేట ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా దుర్గి రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా చిన్ని శ్రీనివాసులు, కుప్పం దిలీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎక్కల నాగేశ్వరరావు, జాయింట్ కార్యదర్శిగా శ్రీరామ్ సుబ్రహ్మణ్యం, అద్దంకి శ్రీనివాసులు, కోశాధికారిగా ఓలేటి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గూడూరు కిషోర్‌కుమార్, గాదంశెట్టి నాగరాజు, పత్తిపాటి తులసీకృష్ణ, అలవల శ్రీనివాసరావు తదితరులు హాజరుకానున్నారు. వీరితో పాటు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

మళ్ళీ మొదలైన ఇసుక దందా!

పాలసముద్రం, నవంబర్ 13 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం నుండి తమిళనాడు రాష్ట్రానికి అక్రమ ఇసుక రవానా దందా మళ్ళీ ప్రారంభమైంది. తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దు మండలమైన పాలసముద్రం మండలానికి రెగ్యులర్ ఎస్ఐగా వున్నప్పుడే ఇసుక అక్రమార్కులు మండలం నుండి తమిళ నాడు రాష్ట్రానికి యధేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలించి లక్షల రూపాయలు దండుకున్నారు. ఇటీవల పాలసముద్రం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న భారతి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పాలసముద్రంకు కొత్తగా ఎస్ఐని ఎవరిని నియమించలేదు. రెగ్యులర్ ఎస్ఐ వున్నప్పుడే ఇసుక అక్రమార్కులు దర్జాగా పాలసముద్రం నుండి ప్రక్కరాష్ట్రం తమిళనాడుకు యధేచ్ఛగా ఇసుక అక్రమంగా తరలించి లాభాలు అర్జించిన ఇసుకాసురులు ప్రస్తుతం ఎస్ఐ లేకపోవడంతో మళ్ళీ రెచ్చిపోతున్నారు. స్థానిక అవసరాలకు సొంత గ్రామాల్లో ఇసుకను ఉపయోగించుకోవచ్చునని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఇదే అదనుగా భావించిన స్థానికులు మండల పరిధిలోని ఇసుకను పక్కాగా ఒక చోట డంప్ చేసి అక్కడి నుండి అధికారుల కళ్ళు గప్పి తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్నారు. మండల పరిధిలో వనదుర్గాపురం, తొట్టికండ్రిగ, పాలసముద్రం, బలిజకండ్రిగ లాంటి తమిళనాడు రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో భారీగా ఇసుక డంపులు ప్రస్తుతం ఏర్పాటు అయినట్లు సమాచారం. జిడినెల్లూరు ఎన్ఆర్ పేత నీవానది, చుట్ట ప్రక్కల వాగుల నుండి ఇసుక అక్రమార్కులు భారీగా ఇసుకను సేకరించి డంప్‌లకు తరలిస్తున్నారు. ఈ డంప్‌ల నుండి అర్ధరాత్రి తమిళనాడు రాష్ట్రానికి ఇసుకను తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. పాలసముద్రం మండలానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఈ ఇసుక డంప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ డంప్‌ల నుండి తమిళనాడుకు అక్రమంగా తరలించడానికి రెండు ట్రిప్పర్లు, మూడు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. పాలసముద్రం మండలం నుండి తమిళనాడుకు అక్రమంగా తరలుతున్న ఇసుకను కట్టడి చేయడంలో ఇటు రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు విఫలం అయ్యారనే విమర్శలు మిన్నంటుతున్నాయి. ఇసుక అక్రమంగా తరలిస్తూ కొంత మంది నాయకులు తమ జేబులను నింపుకొని ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుండటంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

నడిరోడ్డుపై ట్రక్కు.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

శ్రీకాళహస్తి, నవంబర్ 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని పాత పోస్టాఫీస్ మార్గంలో చక్కటి సిమెంటు రోడ్లను మున్సిపాలిటి నిర్మించారు. ఇక్కడ ప్రణాళిక బద్ధంగా మురుగునీటి కాలువలు నిర్చించారు. అయితే ఇక్కడ మున్సిపాలిటి చెత్తలను పోయటానికి ఓ ట్రక్కును ఏర్పాటు చేసారు. ఈ ట్రక్కులో మందుబాబులు తాగిన మందు బాటిల్స్‌ను వేస్తారు. చుట్టుపక్కల వ్యాపారులు తమ చెత్తలను పోస్తారు. ఇక పక్కనే ఓ కళ్యాణమండపం ఉంది. ఇక్కడ కార్యక్రమాలు జరిగినపుడు పుల్లాకులను వేస్తారు. వీటిని మున్సిపల్ అధికారులు ఏ రోజు కా రోజు శుభ్రం చేస్తుంటారు. ఏ రోజు అయినా ఆలస్యం అయితే ఇక అక్కడ రోడ్డుమీదకు చెత్తలు విస్తరిస్తాయి. కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తాయి. రోడ్డంత దుర్గంధభరితంగా మారుతుంది. మున్సిపల్ అధికారులు నడిరోడ్డుపై ఏర్పాటు చేసిన ట్రక్కును తొలగించుకుంటే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మున్సిపల్ కార్మికునికి గాయాలు:

ఓ వైపు వర్షం పొద్దుపొడవక ముందే నాలుగు మాడావీధులుశుభ్రంగా కనబడాలనే ఆ కార్మికుని తాపత్రయంతో గాయడ్డాడు, ఆసుపత్రి పాలయ్యాడు. వివరాలు పరిశీలిస్తే నాలుగు మాడావీధుల్లో పెద్ద ట్రక్కు పొద్దుపొడవక ముందే చెత్తలనుసేకరిస్తారు. ఈ వాహనంలో హరి అనే కార్మికుడు పని చేస్తున్నారు. బుధవారం ఓ వైపు వర్షం కురుస్తుంది. ఈనేపథ్యంలో బేరివారి మండపం సమీపంలో ఓ చేత్తో చెత్తబుట్ట పట్టుకొని ట్రాక్టర్లో ఎక్కడానికి ప్రయత్నించగా ఫుట్ బోర్డు జారి ముందుకు పడి గాయపడ్డాడు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అనుకూల బడ్జెట్ : ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

పుత్తూరు, నవంబరు 13 ప్రభాతవార్త : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు వారధిగా వుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో మౌలిక వసతులకు పెద్ద పీట వేశారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ఒక వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ మరో వైపు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు పనిచేస్తుందని తెలిపారు. జగన్మోహనరెడ్డి సారధ్యంలోని గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, చేతగాని పాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సర్వ నాశనం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన పలు ప్రభుత్వ వ్యవస్థలను గాడిలో పెడుతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతమైన పాలన అందిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించిన ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు రూ. 16,739 కోట్లు, విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి, విద్యార్థుల సుస్థిర భవిష్యత్ కోసం రూ. 30,000 కోట్లు, మహిళా, శిశు సంక్షేమానికి రూ. 4280 కోట్లు, ఎస్సీల సంక్షేమ కోసం రూ. 18,497 కోట్లు, ఎస్టీల అభివృద్ధికి రూ. 7557 కోట్లు కేటాయించిందని వివరించారు. అన్ని వర్గాల అభ్యున్నతి దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ప్రస్తుత బడ్జెట్ ప్రజామోదం పొందిందని తెలిపారు.

రాత్రిపూట చెత్తకుప్పల తొలగింపు : కమిషనర్

తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 13 ప్రభాతవార్త : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని రాత్రి పూట చెత్త కుప్పల తొలగింపు, చెత్త సేకరణ నిరంతరాయంగా చేపట్టాలని కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో రాత్రి పూట చెత్త సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వాణిజ్య సముదాయాలు, హోటల్స్, జన సమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాత్రిపూట చెత్త కుప్పల తొలగింపు, సేకరణ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని అన్నారు. ప్రస్తుతం పగటి పూట రెండు షిఫ్టుల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నారని అ